సాక్షి నిజామాబాద్

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



కబ్జా చేస్తే చర్యలు

చెరువు శిఖం భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో రాజేంద్ర కుమార్ హెచ్చరించారు.

- 8లో ▸



వసూలు చేస్తారా..?

ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రైవేట్ కళాశాలలు తెలంగాణ యూనివర్సిటీకి కామన్ సర్వీస్ ఫీజు కింద రూ. కోట్లల్లో బకాయి పడ్డాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.0 /16.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి చల్లటిగాలులు వీయవచ్చు. సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

బకాయిలు రూ. 55.72 కోట్లు

- జీవన్‌రెడ్డి ఆర్థిక అక్రమాల చిట్టా విప్పుతున్న యంత్రాంగం
- ప్రభుత్వం మారాక బయటకొస్తున్న ప్రభుత్వరంగ సంస్థలు
- వరుసగా బకాయిలు వెల్లడించిన విద్యుత్, ఆర్టీసీ, ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు
- మరోవైపు నియోజకవర్గంలో పలువురి ఆస్తులు తాకట్టుపెట్టిన జీవన్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆర్మూర్‌లో 'మాల్' నిర్మాణం కోసం తీసుకున్న ఎస్ఎఫ్‌సీ రుణాల వడ్డీ అసలును మించిపోయింది. ఆర్టీసీ స్థలం లీజుకు సంబంధించి బకాయిలు ఏళ్లుగా పేరుకుపోయాయి. విద్యుత్ బకాయిలదీ అదే పరిస్థితి. పైగా బకాయిల వసూలులో జీవన్‌రెడ్డిని ఒత్తిడి చేయవద్దని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ సిబ్బందికి సూచనలు చేయడం గమనార్హం.



బకాయిల వసూళ్ల కోసం ఆర్మూర్ పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్‌కు వచ్చిన ఆర్టీసీ అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రభుత్వ రంగ సంస్థలకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం మారనంతవరకు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న వివిధ విభాగాల అధికారులు కొత్త ప్రభుత్వం వచ్చాక మాత్రం పూనకం వచ్చిన మాదిరిగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఆర్మూర్ పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్ నిర్మాణం కోసం తీసుకున్న రుణానికి సంబంధించి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీ స్థలంలో మాల్ నిర్మాణం కోసం ఆరున్నర సంవత్సరాల క్రితం రూ.20 కోట్లు విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరిట తీసుకున్నారని, ఇందుకు సంబంధించి వడ్డీతో కలిపి రూ.45,46,90,000 చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ బకాయిలను 60 రోజుల్లో చెల్లించని పక్షంలో రికవరీ చట్టాల మేరకు చర్యలకు ముందుకెళ్లాల్సి ఉంటుందని ఆ నోటీసుల్లో హెచ్చరించారు. అసలుతో పాటు వడ్డీ సైతం కొండంత పేరుకుపోయేవరకు బకాయిలు వసూలు చేసే విషయంలో ఇప్పటివరకు ఏమీ పట్టనట్లు ఉన్న స్టేట్ ఫైనాన్స్ అధికారులు ఇప్పుడు హడావుడి చేస్తుండడం విశేషం. కాగా ఈ రుణానికి పూచీకత్తు ఉన్న మరో నలుగురికీ నోటీసులు జారీ చేశారు.

■ జీవన్‌రెడ్డికి సంబంధించిన ఒక్క ఆర్మూర్ మాల్ విషయంలోనే మూడు ప్రభుత్వరంగ సంస్థల అధికారుల కారణంగా బకాయిలు కొండంత పేరుకుపోయాయి. చివరకు మాల్ విలువ కంటే అనేక రెట్లు బకాయిలు పడ్డాయి. ఈ నేపథ్యంలో మాల్‌ను స్టేట్ ఫైనాన్స్, ఆర్టీసీ, విద్యుత్ సంస్థల్లో ఎవరు స్వాధీనం చేసుకోవాలో అనే గందరగోళం నెలకొంది. ఈ గందరగోళానికంతటికీ అధికార యంత్రాంగం నిర్వాకమే కారణమనేది మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది. కాగా మరోవైపు నియోజకవర్గంలో పలువురి ఆస్తులు తాకట్టుపెట్టి జీవన్‌రెడ్డి రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ బకాయిల కథ..

ఇక విద్యుత్ కథ మరోలా ఉంది. బకాయిలు రూ.2,57,20,002 వరకు పేరుకుపోయాయి. పేదలు, బడుగు జీవులు కేవలం రూ.300 బకాయి ఉంటేనే విద్యుత్ సరఫరా నిలిపేసే విద్యుత్ అధికారులు జీవన్‌రెడ్డికి మాత్రం రకరకాల మినహాయింపులు, అవకాశాలు ఇవ్వడం చెప్పుకోదగ్గ అంశం. ఈ బకాయిల వసూలులో జీవన్‌రెడ్డిని ఏమాత్రం ఒత్తిడి చేయవద్దని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు కిందిస్థాయి సిబ్బందికి సూచనలు చేయడం గమనార్హం. ఈ క్రమంలో 12 వాయిదాల్లో చెల్లించేలా 2023 ఫిబ్రవరి 4న సీఎండీ అనుమతిచ్చారు. అయినప్పటికీ చెల్లించకపోవడంతో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ మరోసారి 2023 అక్టోబర్ 13న అనుమతులు ఇచ్చారు. అయినప్పటికీ జీవన్‌రెడ్డి చెల్లించలేదు. అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేయలేదు. అయితే ప్రభుత్వం మారడంతో విద్యుత్ అధికారులు తామేదో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న మాదిరిగా సరఫరా నిలిపేయడం విశేషం. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, జీవన్‌రెడ్డి మాత్రం కిందిస్థాయి సిబ్బందితో ఆటలాడుకున్నారు. ఈ నేపథ్యంలో సీఎండీ వ్యవహారశైలిపైనా విచారణ చేయాల్సిన అవసరముందని పలువురు డిమాండ్లు చేస్తున్నారు. అసలు జీవన్‌రెడ్డి బకాయిల విషయంలో బతిమిలాడాలని సిబ్బందికి సీఎండీ సూచించడమేమిటో అనేది తేల్చాల్సిన అవసరముందని పలువురు అంటున్నారు.

ఆర్టీసీ అధికారులు..

జీవన్‌రెడ్డి మాల్‌కు సంబంధించి స్థలం లీజుకిచ్చిన ఆర్టీసీ తనకు రావాల్సిన రెంటల్ బకాయిల విషయమై ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఆర్టీసీకి రూ.7,23,71,807 బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇన్నేళ్ల పాటు బకాయిల రికవరీలో తమకేమీ పట్టనట్లు వ్యవహరించిన ఆర్టీసీ అధికారులు, తీరా భారీగా బకాయిలు పేరుకుపోయాక.. రుణాలు ఇచ్చిన సంస్థలు, విద్యుత్ సంస్థలు వచ్చిన సమయంలోనే నోటీసులతో రావడం గమనార్హం. ఎప్పటికప్పుడు వసూలు చేసుకుంటే ఇంత భారీగా బకాయిలు పేరుకునేవి కావు.

న్యూస్‌రీల్

న్యాక్ ఆధ్వర్యంలో ఉపాధి కోసం శిక్షణ

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు న్యాక్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తామని దీనికోసం ఆసక్తి ఉన్నవారు సంప్రదించాలని జిల్లా న్యాక్ శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, రెండు ఫొటోలు, 10వ తరగతి, ఇంటర్ మెమో తీసుకొని కొత్త కలెక్టరేట్ పక్కన న్యాక్ శిక్షణ కార్యాలయంలో ఈ నెల 18లోపు సంప్రదించాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత హాస్టల్ వసతి ఉంటుందన్నారు. ఎలక్ట్రికల్ శిక్షణ విభాగంలో ల్యాండ్ సర్వే విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. మిగితా వివరాలకు 79813 60101, 97045 87655 సంప్రదించాలన్నారు.

మేలిమి పసుపు వంగడాలనే సాగు చేయాలి



కమ్మర్‌పల్లి : పసుపు పంట సాగు చేసే రైతులు కుర్కుమిన్ శాతం అధికంగా ఉన్న వంగడాలను సాగు చేస్తే మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉంటుందని స్పైసెస్ బోర్డు అడిషినల్ డైరెక్టర్ సుందరేశన్ పేర్కొన్నారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో స్పైసిస్ బోర్డు ఆధ్వర్యంలో పసుపు పంట తవ్వకం మొదలు మార్కెటింగ్, విలువ ఆధారిత తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉంటే ధర కూడా అధికంగానే లభిస్తుందన్నారు. పంట కోసిన తర్వాత పసుపు కొమ్ములను మంచి నీటితో కడిగి ప్లాట్‌ఫారంపై ఆరబోసుకోవాలన్నారు. తర్వాత ఉడకబెట్టుకోవాలన్నారు. 10–12 శాతం తేమ ఉండేట్టు చూసుకోవాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు బాయిరల్, తవ్వకం మిషన్లు, ప్రాసెసింగ్ యూనిట్ రాయితీపై అందిస్తామన్నారు. ఏఈవో రమేశ్ పాల్గొన్నారు.

సంక్షేమ కమిటీ ఏర్పాటు




నిజామాబాద్‌నాగారం:తల్లిదండ్రుల సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమం కోసం రూపొందించిన నిబంధనలను అమలు చేయడం కోసం కేంద్రం చట్టాన్ని రూపొందించింది. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వేతర సంస్థలు, సీనియర్ సిటిజన్లతో జిల్లాస్థాయి కమిటీని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం నియమించారు. ఇందులో తెలంగాణ ఆల్ పెన్షనర్స్– రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామ్మోహనరావును కమిటీ సభ్యులుగా నియమించారు. వీరితో పాటుగా భూమన్న, రాజేశ్వర్, భారతి, మేరీ, తదితరులు ఉన్నారు. వీరికి సంక్షేమ శాఖ జిల్లా అధికారి షేక్ రసూల్‌బీ నియామక పత్రాలను అందించారు.

16న అథ్లెటిక్స్‌లో ఎంపికలు

నిజామాబాద్‌నాగారం : జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 10 గంటలకు నాగారంలోని రాజారాం స్టేడియంలో ఇంటర్ డిస్ట్రిక్ నేషనల్ ఛాంపియన్‌షిప్ కోసం 14, 16ఏళ్ల వయస్సు బాలబాలికలకు ఎంపికలు ఉంటాయని అధ్యక్ష కార్యదర్శులు రత్నాకర్ నరాల, రాజాగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు గుజరాత్‌లో జరిగే అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు. 14వ తేదీ సాయంత్రం ఆరు గంటల్లోపు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. ఈవెంట్స్, 60 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్‌జంప్, హాయ్ జంప్, షాట్‌పుట్, కిడ్స్ జావెలిన్ ఉంటాయని, వివరాలకు 99890 40776లో సంప్రదించాలన్నారు.

పరీక్షా ఫలితాలు వెల్లడి



తెయూ: తెయూ ప్రీ–పీహెచ్‌డీ పరీక్షా ఫలితాలను రిజిస్ట్రార్ యాదగిరి కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణతో కలిసి మంగళవారం విడుదల చేశారు. అక్టోబర్5 నుంచి 7 వరకు నిర్వహించిన ప్రీ–పీహెచ్‌డీ పరీక్షలకు సంబంధించి 16 సబ్జెక్టుల్లో 137 మంది స్కాలర్స్ హాజరు కాగా వారిలో 134 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. వివరాలకు తెయూ వెబ్‌సైట్ చూడాలన్నారు. ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఆరతి, అడిషనల్ కంట్రోలర్ సాయిలు, అపర్ణ, లావణ్య పీఆర్‌వో పున్నయ్య ఉన్నారు.

ఆర్మూర్ బల్దియాలో ముసలం

- చైర్ పర్సన్ వినీతపై బీఆర్ఎస్ కౌన్సిలర్ల అవిశ్వాస తీర్మానం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన 24 మంది కౌన్సిలర్లు
- పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్మూర్ బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు

ఆర్మూర్ : ఆర్మూర్ మున్సిపల్ పాలకవర్గంలో ముసలం చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్‌పై అవిశ్వాస తీర్మానానికి దారి తీసింది. ఆర్మూర్ మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లు ఉండగా 2020 జనవరిలో నిర్వహించిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 23 స్థానాలు, బీజేపీ ఆరు స్థానాలు, కాంగ్రెస్ పార్టీ, ఎంఐఎం ఒక్కో స్థానం, ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండటంతో అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు స్వతంత్ర కౌన్సిలర్లతో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఒక్కొక్కరు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దీంతో ఎంఐఎంను కలుపుకొని బీఆర్ఎస్ పార్టీ బలం 30 కౌన్సిల్ స్థానాలకు చేరింది. బీసీ మహిళ రిజర్వేషన్ ఉన్న చైర్‌పర్సన్ పీఠాన్ని సునాయాసంగా బీఆర్ఎస్ పార్టీ సొంతం చేసుకొని పండిత్ వినీత పవన్‌ను చైర్‌పర్సన్‌గా గెలిపించుకున్నారు. తాజాగా జీవన్‌రెడ్డి ఓడిపోవడంతో మున్సిపల్ పాలకవర్గంలో అంతర్గతంగా ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా బయటకు వచ్చింది. ఎన్నికల్లో చైర్ పర్సన్ దంపతులు బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. వారి ఆరోపణలకు బలం చేకూరే విధంగా చైర్‌పర్సన్ పండిత్ వినీత విజయం సాధించిన వార్డుతో పాటు పట్టణంలో బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి పైడి రాకేష్‌రెడ్డికి అధికంగా ఓట్లు పడ్డాయి. మరో వైపు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ అసెంబ్లీ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్ మాజీ చైర్ పర్సన్ ఇంట్లో ప్రస్తుత చైర్ పర్సన్ భర్త, పలువురు కౌన్సిలర్లు మంతనాలు చేసినట్లు సమాచారం. తనపై అవిశ్వాస తీర్మానం పెడితే పార్టీ మార్చే ఆలోచనలో చైర్ పర్సన్ దంపతులు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నుతో పాటు 24 మంది కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని ఆశ్రయించారు. చైర్ పర్సన్ వినీత పవన్‌పై ఆయనకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారంతా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం లేఖను మంగళవారం సమర్పించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందున మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సూచన మేరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.

పీఠం కోసం ఆశావహులు..

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మద్దతుతో అవిశ్వాస తీర్మానంలో నెగ్గి చైర్‌పర్సన్ పీఠాన్ని సొంతం చేసుకోవడానికి 2వ వార్డు కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత శ్రీనివాస్, 23వ వార్డు కౌన్సిలర్ వన్నెల్ దేవ్ లావణ్య శ్రీనివాస్ పావులు కదుపుతున్నారు.

పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయం

- యాసంగికి నిధుల విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వర్షాకాలం సీజన్‌లో కొత్త మార్గదర్శకాలొచ్చే అవకాశం

మోర్తాడ్(బాల్కొండ) : యాసంగి సీజన్ పంటల సాగుకు పెట్టుబడి సాయాన్ని అందించడానికి కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత పద్ధతినే అనుసరించింది. గత వర్షాకాలం సీజన్‌లో రైతుబంధు సాయం రైతుల ఖాతాల్లో జమ చేసిన విధానంలోనే ఈ సీజన్‌లో అందించడానికి కార్యాచరణ చేపట్టింది. తాము అధికారంలోకి వస్తే రైతుబంధు పథకం పేరును రైతు భరోసాగా మార్చి ఎకరానికి ఒక్కో సీజన్‌లో రూ. 7,500ల చొప్పున అందిస్తామని కాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్టోలో పేర్కొంది. రైతుభరోసాకు సంబంధించి మార్గదర్శకాలను రూపొందించి అమలు చేసే సరికి ఎక్కువ సమయం పడుతుందని తేల్చిన ప్రభుత్వం ఈ సీజన్‌లో పాత విధానాన్నే అనుసరించడానికి మొగ్గుచూపింది. సాధారణ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే రైతుబంధు సాయాన్ని విడుదల చేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుంది. కాని అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్ రావు ఓ ఎన్నికల సభలో చేసిన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకున్న ఎన్నికల కమిషన్ పెట్టుబడి సాయాన్ని నిలిపేసింది. గత ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని ట్రెజరీలో జమ చేసి ఉంచింది. ఇప్పటికే యాసంగి సీజన్ పనులు మొదలు కావడం రైతులు పెట్టుబడి కోసం బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించడం చేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పాత విధానంలోనే జమ చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలత స్పష్టం చేయడంతో తొలిరోజు ఎకరంలోపు భూమి ఉన్నవారికి రైతుబంధు సాయం జమ చేశారు. ఇలా ఒక్కోరోజు భూమి విస్తీర్ణాన్ని పెంచుతూ జమ చేయనున్నారు.

ఫోన్‌చేసి బెదిరిస్తున్నారు..

- ఆర్మూర్ నియోజకవర్గంలో రూ. 2 వేల కోట్ల మైనింగ్ దందా
- అక్రమాలను ఎత్తిచూపితే బెదిరింపు కాల్స్
- సీపీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి
- డీసీపీ వ్యాఖ్యలకు ఎమ్మెల్యే నిరసన



మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

ఖలీల్‌వాడి : ఆర్మూర్ నియోజకవర్గంలోని రెండు క్వారీలు, మొరం మాఫియాలో రూ. 2 వేల కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్లు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌కమిషనర్ కార్యాలయంలో సీపీ కల్మేశ్వర్‌కు దేశ,విదేశాల నుంచి వస్తున్న బెదిరింపు ఫోన్‌కాల్స్‌పై ఫిర్యాదు చేశారు. గంటపాటు సీపీతో ఎమ్మెల్యే సమావేశమైన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ క్వారీల్లో బ్లాస్టింగ్‌తో దీనికి దగ్గర ఉన్న ఇళ్లకు పగుళ్లు వచ్చాయన్నారు. అంతేకాకుండా సుమారు 50 మంది మహిళలకు గర్భస్రావం అయినట్లు తెలిపారు. ఎకరం భూమిని అనుమతి తీసుకొని ఎకరాల కొద్ది మైనింగ్ చేశారన్నారు. దీంతో రూ. కోట్లల్లో ప్రభుత్వ ఆదాయానికి గండిపడిందన్నారు. క్వారీలను పరిశీలించడానికి వెళ్తే దేశ,విదేశాల నుంచి ఫోన్లు చేసి బెదిరిస్తున్నారన్నారు. ఆర్మూర్‌లో రౌడీయిజం పెరిగిపోతుందని, గంజాయి వంటి మత్తుపదార్థాలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారన్నారు. వీటిని నివారించాలని సీపీకి ఫిర్యాదు చేశామన్నారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. భూ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని వ్యక్తిగతంగా ఏమీ టార్గెట్ చేయట్లేదన్నారు. ప్రభుత్వ ఆర్టీసీ స్థలం లీజ్‌కు డబ్బులు చెల్లించలేదని అలాగే కరెంట్ బిల్లులు చెల్లించలేదని, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకొని చెల్లించకపోతే అధికారులు నోటీసులిచ్చారన్నారు. ఆర్మూర్ ప్రాంతంలో చాలా మంది యువకులపై ఆయన కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారన్నారు.

సీపీ కార్యాలయం ఎదుట..

సీపీ కల్మేశ్వర్‌ను కలిసిన అనంతరం విలేకరులతో మాట్లాడి బయటకు వెళ్తున్న సమయంలో డీసీపీ జయరాం వచ్చి కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేకు ఏం తెలుస్తుందని మీడియా సిబ్బందిని తోసివేయడంతో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీ కార్యాలయంలోనే బైఠాయించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీసీపీ గిరిరాజ్, ఏసీపీ కిరణ్‌కుమార్, టౌన్‌సీఐ నరహరి వారిని సముదాయించారు. సీపీ కల్మేశ్వర్ ఎమ్మెల్యేను తన చాంబర్‌లోకి తీసుకెళ్లి సముదాయించారు. మీడియాకు ఇబ్బంది కలగకుండా చూసుకుంటానన్నారు.

మహిళలను వేధిస్తే చట్టరీత్యా చర్యలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

నిజామాబాద్‌నాగారం : మహిళలు పనిచేసే చోట వేధించడం వేధించడం చట్టరీత్యా నేరమని అడిషనల్ కమిషనర్ చిత్రామిశ్రా తెలిపారు. మంగళవారం నగరంలోని నూతన కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో మహిళా శిశు దివ్యాంగుల వయో వృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ శాఖ డీహెచ్‌ఈడబ్ల్యువో ఆధ్వర్యంలో పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ కలెక్టర్ చిత్రామిశ్రా హాజరై మాట్లాడారు. పనిచేసే చోట చూపులతో, మాటలతో, సైగలతో, లైంగికంగా హింసిస్తే కఠినచర్యలు తీసుకుంటామని, ధైర్యంగా మహిళలు ఫిర్యాదు చేయాలన్నారు. దీనికి సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యువో ఎస్‌కె రసూల్ బీ లోకల్ కమిటీ చైర్‌పర్సన్ నీరజ, లోకల్ కమిటీ మెంబర్ హరిప్రసాద్, డీపీవో జయసుధ, లేబర్ ఆఫీసర్ యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

హరితం.. సన్నద్ధం

- పదోవిడత హరితహారానికి సిద్ధమవుతున్న నర్సరీలు
- పాలిథిన్ కవర్లలో మట్టి నింపుతున్న కూలీలు
- ప్రతి జీపీకి 10 వేల టార్గెట్
- వచ్చే ఏడాది నాటే లక్ష్యం 40.67 లక్షలు



డొంకేశ్వర్ నర్సరీలో పాలిథిన్ బ్యాగుల్లో మట్టిని నింపి నీళ్లు పడుతున్న ఉపాధికూలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్) : వచ్చే ఏడాది పదో విడత హరితహారం కార్యక్రమానికి అవసరమయ్యే మొక్కలను పెంచడానికి గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకు జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల్లో ఉన్న నర్సరీలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి పాలిథిన్ కవర్లలో మట్టి నింపి విత్తనాలు వేయాలని డీఆర్‌డీవో నుంచి ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పలు నర్సరీల్లో ఉపాధిహామీ ఏపీవోలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు పనులు ప్రారంభించారు. బ్యాగుల్లో నింపేందుకు ఎర్రమట్టిని సేకరిస్తున్నారు. ఇప్పటికే చాల చోట్ల ఉపాధి హామీ కూలీల సహాయంతో మట్టిని నింపి విత్తనాలు కూడా వేశారు. ఐతే, ఈ ఏడాది లక్ష్యానికనుగుణంగా అన్ని శాఖలు కలిపి 47లక్షల మొక్కలు నాటారు. వచ్చే ఏడాదికి దాదాపు 7లక్షల లక్ష్యాన్ని తగ్గించారు. 2024 సంవత్సరానికి 43 శాఖలు కలిపి 44.67 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించుకోగా, అత్యధికంగా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖలకు కలిపి 25లక్షలు నాటాలని లక్ష్యం ఉంది. ఈ క్రమంలో జిల్లాలోని 530 నర్సరీల్లో 53లక్షల మొక్కలు పెంచాలని అధికారులు టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఈ సారి మొక్కల పెంపకాన్ని తగ్గించిన అధికారులు పంచాయతీకి పదివేల చొప్పున పెంచాలని నిర్ణయించారు.

ఎర్రమట్టి కొరత..

పాలిథిన్ బ్యాగుల్లో నింపేందుకు కావాల్సిన ఎర్రమట్టి గ్రామాల్లో సులభంగా లభించడం లేదు. మొరం, మట్టి తవ్వకాలకు ఎక్కడా అనుమతి లేకపోవడంతో నర్సరీలకు కొరత ఏర్పడింది. మట్టిని తెప్పించుకోవడానికి ఉపాధి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

తద్వారా నర్సరీల్లో మొక్కల పెంపకం ప్రక్రియ ఆలస్యం అవుతోందని పేర్కొంటున్నారు. మట్టి లభించిన ప్రాంతాల్లో ఉపాధిహామీ కూలీలతో పనులు చేయిస్తున్నాయి. మట్టిని జల్లెడ పట్టించి ప్లాస్టిక్ కవర్లతో నింపుతున్నారు. ఇందుకు అవసరమైన పాలిథిన్ కవర్ల కొనుగోలు ప్రక్రియ జిల్లా స్థాయిలో పూర్తయింది. దాదాపు 55 లక్షల కవర్లను టెండర్ల ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కొనుగోలు చేసి మండలాలకు సరఫరా చేశారు.

అత్యధిక లక్ష్యాలున్న పలు శాఖలు

శాఖ పేరు	మొక్కలు
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	25,00,000
మున్సిపల్ కార్పొరేషన్	10,00,000
మున్సిపల్, బోధన్	1,45,667
మున్సిపల్, ఆర్మూర్	1,20,000
ఫారెస్టు	90,000
ఎక్సైజ్	65,000
హార్టికల్చర్	30,000
మున్సిపల్, భీమ్‌గల్	38,000
పోలీసు	20,000
ఇరిగేషన్	10,500
అగ్రికల్చర్	5,000
ఐసీడీఎస్	7,230

సక్రమంగా నిర్వహించాలి..



వచ్చే సంవత్సరం హరితహారం కార్యక్రమానికి అవసరమయ్యే మొక్కలను పెంచడానికి గ్రామాల్లోని ఉపాధిహామీ నర్సరీలను సిద్ధం చేయాలని మండల స్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చాం. పాలిథిన్ బ్యాగుల్లో మట్టి నింపి విత్తనాలు వేసే ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పాం. మొక్కలను సక్రమంగా పెరిగేవిధంగా నీటిని క్రమంగా అందించడానికి ఉపాధి కూలీలను ఉపయోగించుకోవాలి. ఎర్రమట్టి కొరత ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సూచించాం.

– చందర్ నాయక్, డీఆర్‌డీవో

లక్కంపల్లి సెజ్ అక్రమాల నిగ్గు తేల్చండి



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం లక్కంపల్లి గ్రామ శివారులో సెజ్ భూములను ఆక్రమించుకున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మంగళవారం దేవాదాయ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండాసురేఖకు వినతి ప్రతం అందజేశారు. సెజ్ భూములను ప్లాట్లు చేసి అమ్ముకోవాలని కొందరు ప్రయత్నించారన్నారు. నాయకులు దేగాం గంగారెడ్డి, వెంకట్రాం రెడ్డి, పిప్పెర సాయరెడ్డిలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ విలువిద్య పోటీలకు శ్రీనిక



డొంకేశ్వర్(ఆర్మూర్): జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామానికి చెందిన మద్దుల శ్రీనిక ఎంపికైంది. ఈ నెల 13, 14వ తేదీల్లో గుజరాత్ నదియాడ్‌లో నిర్వహించే 14 సంవత్సరాల విభాగంలోని ఎస్‌జీఎఫ్ఐ టోర్నమెంట్‌లో పాల్గొననుంది. జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి శ్రీనిక పాల్గొనే అవకాశం రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

పెట్రోల్ బంకు తనిఖీ



పెర్కిట్: ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ పెట్రోల్ బంకును జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి మహమ్మద్ షుజాత్ అలీ సోమవారం తనిఖీ చేశారు. పెట్రోల్ బంకులో సాంకేతికత వ్యవస్థను పరిశీలించారు. పెట్రోల్ పోయడంలో అవకతవకలు ఉన్నాయని భావిస్తే బంకులో అందుబాటులో ఉండే ఐదు లీటర్ల కొలమానంతో పరిశీలించుకోవాలని సూచించారు.

యాసంగి పంటల ప్రణాళికలు అమలు చేయాలి



డిచ్‌పల్లి: ప్రస్తుత యాసంగికి అధికారులు సిద్ధంగా ఉండి ఇప్పటికే తయారు చేసిన ప్రణాళికలను సక్రమంగా అమలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. మండలంలోని నడిపల్లి రైతువేదికలో జిల్లాలోని ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు, ఏఈవోలతో జేడీఏ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎరువులు, విత్తనాల సరఫరాపై నిఘా ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పథకాలపై రైతులకు సరైన అవగాహన కల్పించి వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖోకు ఎంపిక



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండి మాసానిపేట జెడ్పీ పాఠశాల విద్యార్థిని సరోజ జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు అతీకుల్లా మంగళవారం తెలిపారు. ఈనెల 13 నుంచి కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించే అండర్–14 విభాగం జాతీయ ఖో–ఖో పోటీల్లో సరోజ పాల్గొంటుందన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన సరోజను స్థానికులు అభినందించారు.

కళాశాలల్లో ఫీజుల దందా..

- సీఎస్ఎఫ్ పేరిట విద్యార్థుల నుంచి వసూళ్లు
- యూనివర్సిటీకి చెల్లించకుండా మూడేళ్లుగా తప్పించుకుంటున్న యాజమాన్యాలు
- సీరియస్‌గా తీసుకున్న వర్సిటీ అధికారులు



నిజామాబాద్‌అర్బన్: సీఎస్ఎఫ్ పేరిట తెలంగాణ యూనివర్సిటీకి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రైవేటు డిగ్రీ కళాశాలల నుంచి అందాల్సిన రూ. కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని ఈ సారి ఎలాగైనా వసూలు చేస్తామని యూనివర్సిటీ అధికారులు పేర్కొంటున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 50 ప్రైవేటు, 26 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులు ప్రవేశం పొందేటప్పుడు వారి నుంచి సీఎస్ఎఫ్ (కామన్ సర్వీస్ ఫీజు) పేరిట వసూలు చేస్తున్నాయి.

వీటిని ఆయా కళాశాలల యాజమాన్యాలు తెలంగాణ యూనివర్సిటీకి చెల్లించాలి. కానీ వాటిని చెల్లించకుండా గత మూడేళ్లుగా నాన్చుతూ తప్పించుకు తిరుగుతున్నాయి. అధికారులు సైతం సీఎస్ఎఫ్ చెల్లించని కళాశాలలకు నోటీసులు జారీ చేసినా ఆయా కళాశాలలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రజాప్రతినిధులతో ఒత్తిడి తీసుకువస్తూ అధికారులను మభ్యపెడుతూ ఫీజులు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నాయి.

ప్రతి ఏటా 30 వేల మంది..

ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు సంబంధించి ప్రతిఏటా 30 వేల మంది విద్యార్థుల ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. కానీ వీటిని యూనివర్సిటీకి చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పలు ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు రెండు, మూడేళ్లుగా విద్యార్థుల సీఎస్ఎఫ్ ఫీజులు చెల్లించక యూనివర్సిటీకి ఎగనామం పెడుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం మూడు కళాశాలలు మాత్రమే సీఎస్ఎఫ్‌ను చెల్లించాయి. దీంతో ఇప్పటి వరకు యూనివర్సిటీకి రావాల్సిన సుమారు రూ. రెండున్నర కోట్ల ఫీజు రాకుండా పెండింగ్‌లోనే ఉన్నాయి.

బోధన్, ఆర్మూర్, కామారెడ్డిలో..

బోధన్‌లోని ఓ కళాశాల రెండేళ్లు, ఆర్మూర్‌లోని ఓ కళాశాల ప్రజాప్రతినిధి ఒత్తిడితో మూడేళ్లు, కామారెడ్డిలోని ఓ కళాశాల యాజమాన్యం తమ రెండు కళాశాలలకు చెందిన ఫీజులను చెల్లించక తప్పించుకు తిరుగుతున్నాయి. వీటికి యూనివర్సిటీ అధికారులు సీఎస్ఎఫ్ చెల్లించాలని నోటీసులు జారీ చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

సీరియస్‌గా యూనివర్సిటీ అధికారులు

సీఎస్ఎఫ్ ఫీజు చెల్లించని డిగ్రీ కళాశాలపై వర్సిటీ అధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. ఇటీవల సంబంధిత కళాశాలలకు నోటీసులు సైతం జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో సీఎస్ఎఫ్ చెల్లించని కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అనంతరం కళాశాలల యాజమాన్యాలు అసోసియేషన్ తరపున యూనివర్సిటీ ఉన్నతాధికారులను కలిసి మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నా అధికారులు సైతం సీఎస్ఎఫ్ చెల్లించాల్సిందేనని వారితో పేర్కొన్నట్లు సమాచారం. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజును ఎందుకు చెల్లించడం లేదని ఉన్నతాధికారులు నిలదీసినట్లు తెలిసింది.

చర్యలు తీసుకోవాలి



కామన్ సర్వీస్ ఫీజు పేరిట విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న వాటిని ఆయా యాజమాన్యాలు యూనివర్సిటీకి చెల్లించాలి. లేకుంటా ఆయా కళాశాలల ఎదుట ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడుతాం. సీఎస్ఎఫ్ చెల్లించని వాటిపై యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలి. – లాల్‌సింగ్, టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

ఆందోళనలు చేస్తాం



ప్రైవేటు డిగ్రీ కళాశాలలు విద్యార్థుల నుంచి రూ. వేల చొప్పున వసూలు చేస్తున్న కామన్ సర్వీస్ ఫీజును యూనివర్సిటీకి చెల్లించక పోవడం సిగ్గుచేటు. తక్షణమే ఆయా కళాశాలల యాజమాన్యాలు సీఎస్ఎఫ్ చెల్లించాలి. లేకుంటే ఆందోళనలు, ధర్నాలు చేపడుతాం. – రఘురాం, ఏఐఎస్ఎఫ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి

పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న లీలా లక్ష్మారెడ్డి

భిక్కనూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఫౌండర్, చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. తెయూ సౌత్ క్యాంపస్‌లో మంగళవారం నిర్వహించిన వాతావరణ మార్పు జాతీయ సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. ప్రస్తుతం పర్యావరణం చాలా ప్రమాదంలో ఉందని పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలన్నారు. సౌత్‌క్యాంపస్‌లో వాతావరణం చాలా బాగుందని, క్యాంపస్‌లో ఔషధ వనాన్ని, వ్యర్థపదార్థాల నిర్వహణ, నీటి యాజమాన్య, పద్ధతుల విషయంలో నిరంతరం సహకారం అందిస్తామన్నారు. సదస్సులో హైదారాబాద్ సెంట్రల్ యునివర్సిటీ ప్రొఫెసర్ సర్వోత్తం, సెల్ఫ్ డైరెక్టర్ సాయిభాస్కర్, క్యాంపస్ ప్రిన్సిపాల్, సదస్సు కన్వీనర్ సుధాకర్‌గౌడ్, కో–కన్వీనర్లు డాక్టర్ రాజేశ్వరి, నారాయణ, అధ్యాపకులు మోహన్‌బాబు, హరిత, లలిత, సబిత, ప్రతిజ్ఞ, నాగరాజు, యాలాద్రి సునీత, వైశాలి, రమాదేవి, నర్సయ్య నిరంజన్‌శర్మ, శ్రీకాంత్, దిలీప్, ఇంద్రకరణ్, కనకయ్య, సునీల్, ఏపీఆర్‌వో సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు అందజేస్తున్న సక్రునాయక్

రామారెడ్డి: క్రీడల్లో గెలుపోటములు సహజమని గురుకులాల జాయింట్ డైరెక్టర్ సక్రునాయక్ అన్నారు. మండలంలోని ఉప్పల్వాయి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల బాలుర పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమానికి అయన హాజరై మాట్లాడారు. క్రీడల్లో ఓటమి చెందిన వారు ఆత్మన్యూనతకు లోను కావద్దని క్రీడాకారులకు సూచించారు. అనంతరం విజేత జట్లకు, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ రీజినల్ కో–ఆర్డినేటర్ అలివేలు, టోర్నమెంట్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. శంకర్, స్థానిక ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ గంగారాం, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీరు కలుషితం కాలేదట..!

- సెప్టెంబర్‌లో రంగు మారిన ఎస్సారెస్పీ నీరు
- నవంబర్‌లో నివేదిక



రంగు మారిన ఎస్సారెస్పీ నీరు(ఫైల్)

బాల్కొండ: ఎస్సారెస్పీలో నీరు రంగు మారినా ఎలాంటి కలుషితం జరగ లేదని కాలుష్య నియంత్రణ బోర్డు నివేదిక ఇచ్చినట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. సెప్టెంబర్‌లో ఎస్సారెస్పీలో నీరు రంగు మారింది. అంతే కాకుండా కాలువల ద్వారా ప్రవహించిన నీరు పొలాలకు వెళ్లడంత నష్టం వాటిల్లింది. దీంతో రైతులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు సెప్టెంబర్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సారెస్పీని పరిశీలించిన కలెక్టర్ నీటి శాంపిళ్లను సంగారెడ్డిలోని ల్యాబ్‌కు పంపించేలా చర్యలు చేపట్టారు. రెండున్నర నెలల తరువాత నీటి పరీక్షల ఫలితాలను ప్రాజెక్ట్ అధికారులకు అందడంతో నీటిలో ఎలాంటి కలుషితాలు లేవని నివేదిక వచ్చినట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. కానీ అధికారుల ఫలితాలపై ఆయకట్టు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నివృత్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

నీటిని పరీక్షించాం

ఎస్సారెస్పీలో సెప్టెంబర్‌లో నీరు రంగు మారడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు నీటిని పరీక్షల కోసం శాంపిళ్లను పంపించాం. పదిహేను రోజుల క్రితం నివేదిక వచ్చింది. ఎలాంటి కలుషితం లేదని నివేదికిచ్చారు. – చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

హాస్టల్‌లో విద్యార్థినుల మధ్య గొడవ



బాలికల వసతి గృహం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహంలో సోమవారం రాత్రి ఇద్దరు విద్యార్థినుల మధ్య గొడవ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వసతి గృహంలో రాత్రి పది గంటలకు పదో తరగతి విద్యార్థిని నిద్రపోయే సమయంలో దుప్పటి విషయంలో మరో విద్యార్థినితో గొడవ జరిగింది. ఇరువురు విద్యార్థినులు కొట్టుకోవడంతో రుక్మిణి అనే విద్యార్థికి కడుపులో దెబ్బ తగిలింది. దీంతో విద్యార్థినులు హాస్టల్ వార్డెన్‌కు సమాచారం అందించడంలో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో రుక్మిణికి సర్జరీ అయిన చోటే దెబ్బ తగలడంతో నొపఇప తీవ్రమైంది. ప్రస్తుతం విద్యార్థినికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యాధికారులు తెలిపినట్లు వార్డెన్ ఫర్జానా తెలిపారు. మరో విద్యార్థిని మన్విత విషయంపై అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వార్డెన్ పేర్కొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



చెక్కు అందజేస్తున్న ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ బండి రామగిరి ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రాష్ట్ర ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు రూ.లక్షా యాభై వేల చెక్కును మంగళవారం అందజేశారు.

రామగిరి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకొని ఈ చెక్కును అందించినట్లు తెలిపారు. మండల అసోసియేషన్ తరపున మరో రూ. 15 వేలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభుగౌడ్, భిక్కనూరు మండల అధ్యక్షుడు ఉప్పరి లింబాద్రి, ఆసం సిద్ధరాములు, భూర్ల శ్రావణ్, సమీర్, బత్తుల భిక్షపతి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆసం శ్రీనివాస్ నేతలు నవీన్, బాలరాజు, భూపాల్‌రెడ్డి, సురేశ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

తెయూ: తెయూ పరిధిలోని పీజీ సెమిస్టర్స్ రెగ్యులర్ పరీక్షల ఫీజు చెల్లింపు తుదిగడువును ఈ నెల 15వరకు పొడిగించినట్లు కంట్రోలర్ అరుణ మంగళవారం తెలిపారు. పీజీ 3, 5, 7, 9వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫీజును ఈ నెల 15వరకు, రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 18వరకు చెల్లించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కంట్రోలర్ అరుణ కోరారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

సిరికొండ: మండలంలోని గడ్కోల్‌లో విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను బుధవారం నిర్వహించనున్నట్లు డిచ్‌పల్లి ఏడీఈ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. డిచ్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలోని సిరికొండ, ధర్పల్లి, ఇందల్‌వాయి, డిచ్‌పల్లి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ వేదిక వద్దకు వచ్చి పరిష్కరించుకోవాలని ఏడీఈ కోరారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వేదిక కొనసాగుతుందని అన్నారు.

20 నుంచి డిగ్రీ పరీక్షలు

తెయూ: తెయూ పరిధిలోని డిగ్రీ (బీఏ, బీకా, బీఎస్సీ, బీబీఏ) 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్, 2, 4, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు డిసెంబర్ 20 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ మంగళవారం తెలిపారు. రిజిస్ట్రార్ యాదగిరి ఆదేశాల మేరకు పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె కోరారు.

31 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

నిజామాబాద్‌అర్బన్: అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ద్వితీయ, తృతీయ పరీక్షలకు ఈ నెల 31 వరకు అపరాధ రుసుము రూ. 500తో వార్షిక పరీక్ష ఫీజు చెల్లించవచ్చని కో–ఆర్డినేటర్ రంజిత తెలిపారు. అలాగే పీజీ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు 16వరకు రూ.500 అపరాధ రు సుంతో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చెరువు భూములు కబ్జా చేస్తే చర్యలు



చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో

నిజామాబాద్ రూరల్: చెరువుల శిఖం భూములను ఎవరైనా కబ్జా చేస్తే చర్యలు తప్పవని ఆర్డీవో రాజేంద్రకుమార్ హెచ్చరించారు. మండలంలోని సారంగపూర్ పెద్దచెరువు శిఖం భూమిని తహసీల్దార్ రంజిత్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. చెరువు కబ్జాకు గురవుతోందని ప్రజావాణిలో ఫిర్యాదు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి చెరువు కబ్జాదారులను హెచ్చరించారు. చెరువు శిఖం భూమిని కబ్జా చేసినా, నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖ సంయుక్తంగా సర్వే చేసి చెరువు శిఖం భూమి హద్దులను నిర్ధారిస్తామని పేర్కొన్నారు. అప్పటివరకు చెరువు పరిసరాల్లో భూ ఆక్రమణలు, ఎలాంటి కట్టడాలు చేపట్టదని గ్రామస్తులను హెచ్చరించారు. ఆర్డీవో వెంట రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం



పోచారంను సన్మానిస్తున్న మాజీ జెడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు

బాన్సువాడ: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మొదటి సారి బాన్సువాడకు వచ్చిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయా మండలాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పోచారంను కలిసిన వారిలో మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, నిజాంసాగర్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, దుర్గారెడ్డి, గంగారెడ్డి, సత్యనారాయణ, మోహన్‌రెడ్డి, మనోహర్, రమేశ్‌గౌడ్, వాజిద్‌అలీ, అంజయ్య, చందర్‌రాథోడ్ తదితరులున్నారు.

అక్రమ కట్టడాన్ని పరిశీలించిన అధికారులు

నవీపేట: మండల కేంద్రంలోని నిజాంసాగర్ కాలువ పక్కన నిర్మించిన అక్రమ కట్టడాన్ని ఇరిగేషన్ ఈఈ అహ్మద్ జానీ, డీఈఈ బలరాం, ఏఈ శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. ఇరిగేషన్ స్థలంలో ఇటీవల నిర్మించిన అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలని వార్డు సభ్యురాలు శోభ, ఆమె భర్త అశోక్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను హెచ్చరించడంతో మంగళవారం అక్రమ నిర్మాణాన్ని పరిశీలించారు. రెండు రోజుల్లో కట్టడాన్ని కూల్చేయాలని సంబంధిత వ్యక్తులను హెచ్చరించారు.

క్రైం కార్నర్

దేవీతండాలో గుడిసె దగ్ధం



ఇందల్వాయి: మండలంలోని దేవీతండాలో దేగావత్ అనూషకు చెందిన నివాసపు గుడిసె విద్యుదాఘాతంతో సోమవారం రాత్రి దగ్ధమైనట్లు ఆర్ఐ నరేశ్ తెలిపారు. ప్రమాద సమయంలో అనూష మేఘ్యానాయక్ తండాలో ఉంటున్న కూతురు దగ్గరికి వెళ్లిందని, ప్రమాదంలో తన కొడుకు గల్ఫ్ వెళ్లడానికి దాచిన కొంత నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు కాలిపోయినట్లు బాధితురాలి తెలిపింది. సుమారు రూ. రెండు లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మాక్లూర్: మండలంలోని ధర్మోరలో పేకాట స్థావరంపై దాడిచేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజ్, సీఐ అంజయ్య మంగళవారం తెలిపారు. దాడిలో పేకాట ఆడుతున్న 17 మందిని, వారి నుంచి రూ.74,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం వారిని మాక్లూర్ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ ఖైదు

కామారెడ్డి క్రైం: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని అజామాబాద్‌లో 2017 నవంబర్3న జరిగిన ఓ హత్య కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు మంగళవారం తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈడిగి పర్వగౌడ్‌ను హత్య చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన చింతకాయల ఊశయ్య, దుర్గయ్య, సాయిలు నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. పూర్వాపరాలు, సాక్షాధారాలను పరిశీలించి నేరం రుజువు కావడంతో నేరస్తులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి తీర్పు వెల్లడించారు. కేసు పరిశోధన, సాక్ష్యాధారాలను సక్రమంగా ప్రవేశపెట్టడంలో కృషి చేసిన ఎల్లారెడ్డి సీఐలు సుధాకర్, శ్రీనివాస్, పీపీ రాజ్‌గోపాల్‌గౌడ్, కోర్టు కానిస్టేబుళ్లు కిరణ్‌గౌడ్, బాలకృష్ణ, లైజనింగ్ అధికారి విఠల్‌ను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

వార్డు సభ్యురాలు మృతి

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు తండాలో వార్డు సభ్యురాలు ఒలికి బషవ్వ (50) మంగళవారం మృతి చెందింది. రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు నూతనంగా నిర్మించిన డ్రైనేజీలో పడడంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీల మహిళా కార్యకర్తగా కొనసాగిన బషవ్వ మృతిని తెలుసుకున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి ద్వారా రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. సర్పంచ్ నాన్కుబాయి పీర్యానాయక్, ఎంపీటీసీ యశోద రతన్, నాయకులు సంగం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, సంజీవ్‌రెడ్డి, కొండ సాయిలు, నరేశ్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ముట్టడి



నిరసన తెలుపుతున్న వినియోగదారులు

ఎడపల్లి: మండలంలోని జానకంపేటలో ఉన్న ప్రవీణ్ పెట్రోల్ బంక్‌లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వినియోగదారులు మంగళవారం పెట్రోల్ బంకును ముట్టడించారు. టాయిలెట్లకు తాళాలు వేసి పరిశుభ్రత పాటించడం లేదని, తరచూ బంకును మూసి వేస్తున్నారని ఆరోపించారు. మంచినీటిలో పురుగులు రావడంపై యాజమాన్యంపై మండిపడ్డారు. అధికారులు స్పందించి డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.